# రెండు రాగాలు - ఒక పాట

"మీరు చాలా అలజడిపడుతున్నట్టున్నారు" అని పలకరించిందావిడ యింగ్లీషులో.

నేను తలూపుతూ "మూడురోజులక్రితం నేను మీ దేశం వచ్చాను. అంతకుముందు ప్రయాణంలో రెండు రోజులు గడిచాయి. మొత్తం అయిదు రోజులుగా మాయింటికీ నాకూ సమాచార సంబంధాలు తెగిపోయాయి.." అన్నాను.

నల్లటి చారలున్న గోధుమరంగు గౌనులోంచీ ఆమె గులాబీరంగు శరీరం శిలాజంలా అసహజంగా కనబడుతూ నాలో యేదో తెలియని భయాన్ని రేకెత్తిస్తోంది. మోకాళ్ల వరకూ వేలాడుతున్న గౌను కింద ఆమె కాళ్ళు దృఢంగా, మగవాడికాళ్లలా కనబడుతున్నాయి. స్లీవ్‌లెస్ గౌనులోంచీ బయటికొచ్చిన భుజాలు బలంగా , మొరటుగా వున్నాయి. భుజాల వరకూ వేలాడుతున్న వూదా తెలుపురంగుల జుట్టు ఆమె తలవెనుక అదో రకపు నైరాశ్యపు నీడల్ని పరుస్తున్నట్టున్నాయి. ఆమె మెడలో వేలాడుతున్న తెల్లరంగు గొలుసు బింకంగా వున్న వక్ష స్థలంలోకి జారి మాయమైపోతోంది. నిండుగా నవ్వుతున్న పెదవులు తగినంత ఆత్మీయితను వెల్లడించకపోవడంతో ఆమె బిడియంగానే వున్నట్టుగా తోస్తోంది.

ఆమె నా ముందున్న కుర్చీలో కూచున్నాక "నా పేరు సిల్వియా... ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా వున్నాను... అప్పుడప్పుడూ సృజనాత్మక రచనలూ చేస్తుంటాను" అంది.

పన్నెండవ అంతస్థులోని గాజు తలుపుల కిటికీలోంచీ మెక్సికో నగరపు ఆకాశ హర్మ్యాలు ప్లాస్టిక్ పుట్టగొడుగుల్లా కనబడుతున్నాయి. బూడిదరంగు ఆకాశంలో తెల్లటి మేఘాలు నిర్లిప్తంగా సాగిపోతున్నాయి.

హాలులోని మధ్య భాగాన్నంతా పెద్ద వృత్తాకారపు డైనింగుటేబులు దురాక్రమణ చేసేసింది. దానిపైన మెరుస్తున్న యెంగిలి పళ్లాల పక్కన, స్టీలు చెంచాలూ, ఫోర్కులూ, రంగురంగల రుమాళ్ళూ విచ్చల విడిగా పడివున్నాయి. టేబులు పక్కనున్న కుర్చీలన్నీ అతిథుల నిబ్బంది పెట్టడం యిష్టంలేనట్టుగా, లాగిన చోటికల్లా తరలిపోయివున్నాయి.

హాలు అంచుల్లో గుంపులు గుంపులుగా కూర్చున్న వ్యక్తులందరూ పైకప్పు లేచిపోయేటట్టుగా అరుస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు. పొడవాటి స్టీలు మగ్గుల్ని మోసుకొచ్చిన వెయిటర్లు అతిథుల చేతల్లోని కప్పుల్లో తేనీరు నింపుతున్నారు. పొడవాటి చుట్టలతోబాటూ, రంగురంగుల సిగరెట్లు హాలులో పొగాకు వాసనను మత్తుగా పరుస్తున్నాయి.

"యిప్పుడిక మీ దగ్గర టెలిఫోను కార్డుంది గదా! దీన్ని వుపయోగించుకుని రైటర్స్ హవుస్ నుంచీ కూడా మీరు మీ దేశానికి మాట్లాడుకోవచ్చు" అందామె.

అవతలి గుంపు దగ్గర మోకాళ్లపైన నిల్చున్న వ్యక్తి తన లావుపాటి పెదవులు చేపపిల్లల్లా కదులుతుండగా పెద్దగా స్పానిష్ భాషలో యేదో పాట పాడుతున్నాడు. చుట్టూ కేరింతల కొడుతున్నవాళ్ళు యెర్రగా బుర్రగా - పళ్ళల్లా నిగనిగలాడుతున్నారు. యిద్దరు ముగ్గురి బట్టతలలు తక్కాళిపల్లల్లా మెరుస్తున్నాయి. వాళ్లమధ్య యెర్రటి స్వెట్టరు తొడుక్కున్న వాడేకర్ పొడవాటి సిలిండరులా కనబడుతున్నాడు.

"అది స్పానిష్ జానపదగీతం. మీ గ్రూపు లీడరుకు మా స్పానిష్ బాగానే అర్థమవుతున్నట్టే వుంది" అందామె.

"వాడేకర్ యింగ్లీషులో కూడా రాస్తాడు. చాలా దేశాలలో తిరిగొచ్చినవాడు. పైగా మెట్రోపాలిటన్ లో జీవిస్తున్నాడు. యిల్లాంటి పార్టీల్లో నీళ్లల్లో చేపపిల్లలా హాయిగా కలిసిపోతాడు" అన్నాను నా కంగారును తాత్కాలికంగానైనా మరచిపోయే ప్రయత్నం చేస్తూ.

"కానీ ఆమూడో సభ్యుడు మాత్రం నడి సముద్రంలా దారితప్పిపోయిన నావికుడిలా కనబడుతున్నాడు. మా వాళ్లతో మాట్లాడడంకంటే ఆయనకు మీ దేశపు అంబసీ వాళ్లతో మాట్లాడ్డమే యిష్టంగా వుంది" అందావిడ. యిండియన్ అంబసీ మూడో సెక్రటరీతో మాట్లాడుతున్న గుణాకర్ పాంటుపైన జుబ్బాతొడుక్కున్న బెడస కోడిలా కనబడుతున్నాడు.

"మా గుణాకర్ చిన్న బస్తీలో వుంటాడు. యెప్పుడోగానీ నగరాలకు వెళ్లడు. రోటీ, దాల్,చాయ్, సిగరెట్టు దొరక్కపోతే విలవిలలాడిపోతాడు. యింగ్లీషు అంతగా రాదు. వాడేకర్ వుత్తరధ్రువమైతే యాయిన దక్షిణ ధృవం" అన్నాను.

"వాళ్లిద్దరూ ధృవాలైతే మీరు భూమధ్యరేఖా?" అంటూ సిల్వియా పెద్దగా నవ్వేసింది. ఆమె లిప్‌స్టిక్ పెదవుల మధ్యలోంచీ సిగరెట్టు పొగలతో నల్లచారలను సంతరించుకున్న ఆమె పొడవాటి పలువరస ఆమె జీవితానుభవాల సారంలా కనిపిస్తోంది. "మీ గ్రూపులీడరుకు యింగ్లీషుతో బాటూ కాస్త కాస్త స్పానిస్ గూడా వచ్చు. మీకు యింగ్లీషు మాత్రమే వచ్చు. ఆ మూడో వ్యక్తికి హిందీ మాత్రమే వచ్చు. మీ గ్రూపు లీడరు

పొగతాగడు. ఆ మూడో వ్యక్తి సిగరెట్టు లేకుండా కనిపించడు. మీరేమో కంపెనీలో సిగరెట్టు తాగగలరు. మీ లీడర్ పొడుగ్గా, సన్నగా వున్నాడు. మీరేమో నలుపు. ఆ మూడో ఆయన పొట్టిగా, యెర్రగా వున్నాడు. మీ సాహిత్య అకాడమీ చాలా జాగ్రత్తగా మూడురకాల ప్రతినిధుల్ని వెతికిపట్టి మా దేశానికి డెలిగేషన్‌గా పంపినట్టుంది" అందామె.

"వాడేకర్‌ది మహారాష్ట్ర. గుణాకర్ వుత్తర ప్రదేశ్ సరిహద్దుల్లో నేపాల్‌కు దగ్గరగా వుంటాడు. నేను దక్షిణ భారతదేశంనుంచీ వచ్చాను. మా విశాలమైన దేశంలో యిలాంటి శారీరక తేడాలు స్పష్టంగా కనబడడం అసహజంగాదు. వాడేకర్ నగరంలో కార్పొరేట్ వ్యాపార సంస్థలో పనిచేసే మనిషి. గుణాకర్ వొక చిన్న స్థానిక పత్రిక సంపాదకుడు. నేను యూనివర్సిటీలో లెక్చరర్ని. అందుకే మా భాషా పరిజ్ఞానాల్లో గూడా తేడాలున్నాయి. యిక పొగతాగే విషయంలో వున్న తేడాల విషయమంటారా ? దీనికి శాస్త్రీయమైన సమాధానమేమీ దొరకదు" అంటూ నేను పరిచయాన్ని పెంచుకోవడం కోసం చమత్కారంగా మాట్లాడడానికి ప్రయత్నించాను.

సిల్వియా సిగరెట్టును వెలిగించుకున్నాక "యిది వరకూ మీరు మీ రాష్ట్రంలోని రచయితల పరిస్థితిని గురించి చెప్పారు. నాకా విషయం చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది" అంది.

"యిందులో నేను వుత్ప్రేక్షించిందేమీ లేదు" అంటూ నేను మళ్లీ ఆ విషయాన్నే పొడిగించాను "మా దేశంలో సాహిత్య పత్రికంటూ లేని భాష మా తెలుగేనని పెద్ద పెద్ద మేధావులు గుర్తు చేస్తూ వుంటారు. మా పత్రికలు పాపులర్ సాహిత్యానికి పెద్ద పీట వేస్తుంటాయి. ముప్పాతికవంతు పత్రికలు రచయితలకు ప్రతిఫలంగూడా యివ్వవు. చాలా పత్రికలు ప్రచురించిన రచనల కాంప్లిమెంటరీ కాఫీలుగూడా ఆయా రచయితలకు పంపవు. యిటువంటి నిరుత్సాహకరమైన పరిస్థితిలో సైతం మా భాషలో దాదాపు యాభైమంది కథకులూ, కవులూ, తమ బాధ్యతగా ముఖ్యమైన విషయాలను గురించిన రచనలు చేస్తూనే వున్నారు. ."

"నిజంగా అభినందించాల్సిన అంశమే! అయితే మీకు రచయితల సంఘాలులేవా? తమ హక్కుల గురించి గూడా పోరాటం చేయలేని రచయితలు మిగిలిన సాదా సీదా వ్యక్తుల గురించి యేం పోరాటం చేయగలుగుతారు ?" ఆమె నొసలు చిట్లించుకుని సూటిగా చూస్తూ ప్రశ్నించింది.

"మాకూ రచయితల సంఘాలు లేకపోలేదు. అవి తమకంటే సాదాసీదా జనం హక్కుల కోసం పోరాడ్డానికే ప్రాముఖ్యత నిస్తున్నాయి" అన్నాను నేను వుద్వేగంగా . .

ఆమె కుర్చీలో సర్దుకుని కూచున్నాక కాస్సేపు మైనపు బొమ్మలా మౌనంగా వుండిపోయింది. తరువాత యిప్పుడే జీవమొచ్చినట్టుగా కదిలి“ మీరు మీ స్త్రీవాద రచయిత్రుల గురించి చెప్పిన అంశాలు గూడా ఆశక్తి కరంగా వున్నాయి. మొత్తంపైన మీ భాషలో యెందరు స్త్రీవాద రచయిత్రులున్నారు?” అని అడిగింది సిల్వియా .

“మా రాష్ట్ర జనాభా పదికోట్లని అంచనా. ప్రపంచం మొత్తంలో మా తెలుగువాళ్ల సంఖ్య పదిహేనుకోట్ల దాకా వున్నారని అంటారు. స్త్రీవాద రచయితల సంఖ్యేంతో నేను ఖచ్చితంగా చెప్పలేను. చిన్నా పెద్దా రచయిత్రులను కలిపితే ఆ సంఖ్య వందో, వందా యాభైయ్యో వుండవచ్చునేమో! మళ్లీ అందులో మైనారిటీ స్త్రీవాదులూ, దళిత స్త్రీ వాదులు అంటూ రెండు గ్రూపులను విభజించవచ్చు” అన్నాను.

పొట్టిగా, సన్నగా, క్రోటనుపువ్వులాగున్న అమ్మాయి మా దగ్గరికొచ్చింది. ఖాకీరంగు పాంటుపైన నీలిరంగు చొక్కా తొడుక్కుందా అమ్మాయి. తలకు పెద్ద రుమాలును స్కార్ఫులా కట్టుకుంది. తెల్లటి ముఖంలో కొట్టొచ్చినట్టుగా కనబడుతున్న నల్లటిలిప్‌స్టిక్, చెవులకు వేలాడుతున్న గాజులంత పెద్దవైన రింగులూ, నవ్వుతున్నప్పుడు యెలుక పిల్లను గుర్తుకు చేసే చిన్న పళ్ల వరసా, ఆమె యేదో కార్టూను సినిమాలోని బొమ్మని గుర్తుజేస్తోంది. నన్ను పలకరిస్తున్నట్టు నవ్వాక సిల్వియా చేతిలోని సిగరెట్టు పెట్టెలోంచీ చనువుగా సిగరెట్టు తీసుకుంది. సిల్వియా తన వానిటీ బాగులోంచీ సిగార్ లైటర్ తీసి ఆ అమ్మాయికిస్తూ “మేమిద్దరం నీకాసక్తికరమైన ఫెమినిజం గురించే మాట్లాడుకుంటున్నాం” అంది. “యీ అమ్మాయి పేరు ఫ్రెదా! పిల్లల సాహిత్యంలో కృషిచేస్తోంది. పెయింటింగ్ గూడా చేస్తూంటుంది. నార్త్ మెక్సికోలో వుంటుంది” అంటూ సిల్వియా ఆమెను పరిచయం చేసింది.

కుర్చీలో కూచునీ కూచోకముందే “మీ పాఠశాలల్లో పిల్లలకు సెక్స్‌యెడ్యుకేషన్ బోధిస్తారా?” అంటూ సూటిగా విషయంలోకి దిగేసింది ఫ్రెదా.

“ప్రయత్నాలైతే జరిగాయి గానీ అది యింకా పెద్ద టాబూగానే మిగిలిపోయింది మాదేశంలో. బీదరికమూ, నిరక్షరాస్యతా, బ్రూణహత్యలూ, ఆడపిల్లల్ని అమ్మేయడాలూ, వ్యభిచారాలూ, కనీసావసరాలకోసం పడుపువృత్తికి దిగజారే పరిస్థితీ, భయంకరమైన ఆర్థిక అసమానతలూ, పెద్ద అపహాస్యంగా మారుతున్న ప్రజాస్వామ్యమూ – యివన్నీ వున్నప్పుడు సెక్స్‌యెడ్యుకేషన్ గురించి ఆలోచించగలిగే అవకాశం మాత్రం యేముంటుంది?” అని వాదించాను.

“మీరు చెబుతున్న సమస్యలు యే దేశంలో మాత్రంలేవు?” ఫ్రెదా నవ్వుతున్నా,

ఆమె గొంతులో మాత్రం ఆవేశం స్పష్టంగా పలుకుతోంది. "సెక్స్‌యెద్యుకేషన్ అన్నది సాంఘిక సమస్య మాత్రమే గాదు. వ్యక్తి గతమైనది గూడా. కనీసం చదువుకోగలిగిన పిల్లలకైనా యీ సమస్య యేమిటో తెలియాలి. దానివల్ల యెంతో ప్రయోజనం వుంటుంది".

"మన టీవీలూ, సినిమాలూ, యింక మాట్లాడితే మన పార్కులూ, పార్టీలూ యిదే సమస్యవల్ల వస్తున్న రకరకాల పరిణామాల్ని ప్రాక్టికల్స్ రూపంలో అందరికీ పరిచయం చేస్తున్నాయి. యింక ప్రత్యేకంగా పిల్లలకీ పాఠాలు చెప్పాల్సిన అవసరముందా ?" సిల్వియా ముఖం చిట్లించుకుని ప్రశ్నించింది.

"అందుకే మనకిక్కడ సెక్స్ గురించి శాస్త్రీయంగా పాఠాలు చెప్పాల్సిన అవసరం వుంది. లేకపోతే అమాయకత్వంతో దారి తప్పి పోతున్న యువత నిజమేమిటో తెలుసుకునేలోగా ప్రమాదంలో పడిపోతుంది" ఫ్రెదా సిల్వియాకు తీవ్రమైన స్థాయిలో సమాధానం చెప్పాక నాకేసి చూసి "యీ విషయానికి ప్రాధాన్యత నివ్వకపోవడంవల్లే మీ దేశంలో యెయిడ్స్ సమస్య పెద్దదైపోయింది" అని ముక్తాయించింది.

"తగినంతగా అభివృద్ధి చెందని దేశాల్లో సెక్స్ యెద్యుకేషన్‌వల్ల అనుకోని యిబ్బందులు యెదురౌతాయి" సిల్వియా గొంతు స్పష్టంగా పలికింది.

"యిది గూడా సామాజిక సమస్యే! సమాజమూ వ్యక్తీ వేరుకారు. వ్యక్తి గత పరిణితి సమాజాన్నీ, సమాజాభివృద్ధి వ్యక్తినీ ప్రభావితం చేస్తాయి. .." ఫ్రెదా కీచుగొంతుక చురకత్తిలా దూసింది.

"మీ దేశపు రచయితలకు నగరపు అత్యాధునిక హోటలు పెంట్‌హౌస్‌లో బాక్వెంట్ ముగించాక, యిలా యీ విషయాన్ని గురించి త్రేన్పుతూ చర్చించే అవకాశం వుంది. మా స్త్రీవాద రచయిత్రులు వ్యక్తిగతమైన సమస్యలతోనే సతమతమౌతున్నారు. యిక పక్కనున్న వ్యక్తి గురించి ఆలోచించే వీలు వారికెక్కడుంది?" అంటూ నేను అడ్డుతగిలాను.

అవతలి టేబులు దగ్గర గుణాకర్ అంబసీ సెక్రట్రీతో యింకా యేదో హిందీలో మొరబెట్టుకుంటున్నాడు. మరో వైపున 'టకీలా' అనే మెక్సికన్ దేశపు ప్రత్యేక మద్యాన్ని చప్పరిస్తూ డాన్సు చేస్తున్న నడివయస్సు రచయితను హుషారెత్తించడం కోసం వాడేకర్ చప్పట్లు చరుస్తున్నాడు.

"మీ స్త్రీవాద రచయిత్రులకు ఆర్థిక స్వాతంత్రం లేదా?" అని అడిగింది ఫ్రెదా.

" ఆర్థిక స్వాతంత్ర మున్నంతలో వారిగేదేముంది? మన దేశంలో కూడా స్త్రీవాద రచనలన్నీ ఆత్మకథాత్మకంగానే సాగడంలేదూ?" సిల్వియా అడ్డుతగిలింది.

నే నామెను పట్టించుకోకుండా "మీకు మరో సంగతి చెబుతాను వినండి. దాదాపుగా

మా స్త్రీ వాద రచయిత్రులందరూ పెళ్ళిళ్ళయ్యాక రచనలు చేయడం ప్రారంభించినవాళ్ళే. అంటే యేమిటి? వాళ్ళల్లో కొందరు స్వంతంగా సంపాదించుకుంటున్నారు. అయినా అందరూ భర్తల అదుపాజ్ఞల రుచి తెలిసినవాళ్ళే! అందువల్ల వాళ్ల ఆర్థిక స్వాతంత్రం అంతంత మాత్రమే" అన్నాను.

"అంత ఆలస్యంగా రాయడం మొదలు పెడితే అలాగే జరుగుతుంది. రాయడమన్నది టీనేజీలో నుంచే మొదలవ్వాలి" అంది సిల్వియా.

"మా స్త్రీ వాద రచయిత్రుల విషయంలో రాయడం ఆలస్యంగా జరగటమన్నది గాదు సమస్య. చదువుకున్న కుటుంబాలలో స్త్రీలకు యిరవైరెండు యిరవై మూడేళ్ళకంతా పెళ్ళిళ్ళవుతున్నాయి. మిగిలిన కుటుంబాల్లో బాల్య వివాహాలు గూడా రివాజే! పెళ్ళి విషయంలో చాలావరకూ అమ్మాయిలది పాసివ్ పాత్రే! పెద్దల నిర్ణయం ప్రకారం, అబ్బాయికి నచ్చడం పైన ఆధారపడి చాలా పెళ్ళిళ్ళు జరిగిపోతాయి" అని జవాబు చెప్పాను.

"అలాగా!" ఫ్రెదా ఆశ్చర్యపడిపోయింది. "డేటింగ్‌లు చేయాల్సిన వయస్సులో పెళ్లిళ్ళెందుకు?..."

నేను సమాధానం కోసం వెతుక్కుంటూండగా సిల్వియా "జేమ్స్ యేమంటున్నాడు మై లవ్?" అని ఫ్రెదాను అడిగింది.

"అతన్ని చూసి రెండు నెలలైపోయింది.." ఫ్రెదా కళ్ళు మెరుస్తుండగా నవ్వేసింది. "యిప్పుడు జేవియర్"

"యెవరతను?" సిల్వియా కన్నుగీటుతూప్రశ్నించింది.

"మాత్యూస్ అండ్ గ్రేవిస్ కంపెనీలో పనిచేస్తాడు. యివ్వాళ నాతో యిక్కడికి రమ్మని పిలిచాను. కానీ అతడికి రచయితలూ, రచనలూ అంటే యిష్టంలేదు. కార్ల గురించీ, ట్రక్కుల గురించీ అయితే పరవశంగా మాట్లాడతాడు."

"అలాంటి మనిషి నీకెలా నచ్చాడు?.."

"జేమ్స్‌ను చూశాక నాకూ రచయితలన్నా, చిత్రకారులన్నా మొగం మొత్తింది. నేనేం చేస్తున్నానో, నా పుస్తకాల్లో యేముందో జేవియర్ పట్టించుకోడు. నాకైతే సుఖంగా వుందిప్పుడు."

"డేటింగ్ అంటే కలిసి జీవించడమే కదా?" అని అడిగాను సందేహిస్తూనే.

"అవును. పగలల్లా యెవరిపనుల్లో వాళ్ళుంటారు. రాత్రుళ్లో వొకరుయింకొకరి యింటికి చేరుకుంటారు. వీకెండ్స్‌లో యిద్దరూ వాళ్ళ కిష్టం వచ్చిన రీతిలో తిరుగుతారు" అంది సిల్వియా.

"మొహం మొత్తినప్పుడు విడిచిపెట్టేస్తారు" అని చివాలున అడ్డు తగిలాను. "యీలోగా కడుపొస్తే అబార్షన్ చేయించుకుంటారు".

"లేదా యిష్టం వుంటే పిల్లల్నీకంటారు. ఆ బిడ్డను అవసరమున్నన్ని రోజులు పెంచనూ పెంచుతారు" ఫ్రెడా సిల్వియా కేసి చిలిపిగా చూస్తూ చెప్పింది.

సిల్వియా సిగ్గుపడుతూ "పిల్లల్ని కందామనుకునేటంత మంచి బాయ్‌ఫ్రెండు దొరికినప్పుడు..." అని వాక్యాన్ని పూరించింది.

ఫ్రెడా పరవశంగా నవ్వి "మరి నువ్వు నీకిష్టమైన బాయ్‌ఫ్రెండును కలిసి చాలా రోజులై పోయినట్టుంది.."అంది.

సిల్వియా కుర్చీలో సర్దుకుని కూచుని"మూడు నెలలై పోయింది మైలవ్! వెళ్ళి కలుస్తానంటే మాథ్యూస్ కేమీ అభ్యంతరం లేదు. కానీ నాకే తీరడం లేదు. పెడ్రో రెండువారాల క్రితం ఫోను గూడా చేశాడు... నువ్వెప్పుడు కలిశావ్ పెడ్రోను?"అని అడిగింది.

"ప్రతి ఆదివారపు సాయంత్రమూ వాళ్ళింట్లోనో... పోకపోతే అతను బాధపడతాడు.." ఫ్రెడా ముఖంలోనూ అదే రకపు ఆనందం ప్రతిఫలించింది.

"పెడ్రో సంగతి నాకు తెలియదా? అతను భలే పొసెసివ్. అందుకే అతనంటే నాకు కోపం" అంటూ సిల్వియా చిరుకోపాన్ని ప్రదర్శించింది.

"దాన్ని పొసెసివ్‌నెస్ అనరు. ప్రేమ అంటారు" ఫ్రెడా ముఖంకోపంతో యెర్రబడింది.

"నువ్వు నామాటెప్పుడు విన్నావు గనుక? నీతో వాదించడం కష్టం.... నీ యిష్టంనీది నా ధోరణి నాది అనుకుంటే పోతుంది" సిల్వియా నవ్వడానికి ప్రయత్నించి విఫలురాలైపోయాక సిగరెట్టు వెలిగించే మిషతో ముఖాన్ని చాటేసింది. ఫ్రెడా కోపంగా సిల్వియా చేతిలోని సిగరెట్టు లాక్కుని తన పెదవుల మధ్య పెట్టుకుంది.

"మీ సిగరెట్టు తెల్లగా, పొడుగ్గా, అందంగా వుంది. నేనూ వొకటి తీసుకోనా?" వాళ్ళిద్దరి దృష్టినీ నావైపుకు తిప్పుకోవడం కోసం అడిగాను.

"యివి ఆడవాళ్ల సిగరెట్లు" అంది ఫ్రెడా విసుగ్గా.

"మీరు కాలుస్తానంటే నాకేం అభ్యంతరం లేదు" అంటూ సిల్వియా ఫ్రెడా చేతిలోంచీ సిగరెట్టు పెట్టను తీసి నాకందించింది.

"ఆడవాళ్ళకంటూ వేరే సిగరెట్లుండడం ఫెమినిజం లక్షణమా?" అని ప్రశ్నించాను సవాలు చేస్తున్న ధోరణిలో.

"మీ దేశంలో ఆడవాళ్ళు సిగరెట్లు లేవా?" ఫ్రెడా యింకా అదే తీవ్రతతో యెదురు ప్రశ్నవేసింది.

"మా దేశంలో కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఆడవాళ్లు బీడీలూ, చుట్టలూ కాలుస్తారు. కొన్నిచోట్ల వాళ్ళు..." అంటూ నేను అడ్డచుట్టను యింగ్లీషులో యేమనాలో తోచక ఆగిపోయాను... తరువాత సిల్వియా కేసితిరిగి "వాళ్ళను చాలామంది అనాగరికులని అంటారు" అన్నాక "మరేమీ అనుకోకపోతే, మిమ్మల్నో ప్రశ్న అడగనా? మీకు పెళ్ళయ్యిందా?" అని అడిగాను.

ఆమె శబ్దం రాకుండా పెదవుల్ని సాగదీసి నవ్వి అదోలా తలపూపింది.

సమాధానమేమిటో స్ఫురించకపోయినా నేను బింకంగా "పిల్లలు?" అంటూ మరో ప్రశ్నను సంధించాను.

"నలుగురు...." అందామె.

దానికి సంబంధించిన మరో ప్రశ్నను అడగబోయి, మర్యాద కాదేమోనని సందేహిస్తూ ఆగిపోయాను. ఫ్రెడా అర్థం చేసుకున్నట్టుగా తలపూపి, సిల్వియాకేసి చూసి చిలిపిగా నవ్వింది.

"మరి మీకు?" అని ఫ్రెడా నడిగాను.

"అప్పుడేనా? నా వయస్సు యిరవైతొమ్మిదే!" అంది ఫ్రెడా.

"యీ వయస్సుకే అమ్మమ్మలైపోయినవాళ్లు మా దేశంలో యెందరున్నారో మీకు తెలుసా?" అని కవ్వించాను.

"బహుశా వాళ్ళకు కాంట్రాసెప్టివ్స్ గురించి తెలిసుండదు" అంటూ సిల్వియా ఫ్రెడా కేసి చూసి కన్నుగీటింది.

"నేను చెబుతున్నది పల్లెటూరి అమ్మాయిల గురించి... వున్నతవర్గాల గురించి నాకు తెలియదు గానీ మాదేశంలో పెళ్ళికి ముందు సెక్స్ అన్నది పాపంగానే భావిస్తారు" అన్నాను.

సిల్వియా నాకేసి వురిమి చూసి పెదవులు వణుకుతుండగా యేదో చెప్పబోయి అంతలో తమాయించుకుంది. ఫ్రెడా ఆమె చేయిని పట్టుకుని మృదువుగా నొక్కాక నవ్వడానికి ప్రయత్నించింది.

యింతలో గుణాకర్ నన్ను గొంతెత్తి పిలిచాడు.

అంబసీ సెకండ్ సెక్రటరీ రోహిత్ కుమార్ "మీ యింట్లోంచీ సమాధానం వస్తోంది. వెళ్లి మాట్లాడండి" అన్నాడు హిందీలో.

నేను పైకిలేచి హాలుకోమూలలో వున్న టెలిఫోను దగ్గరికి పరిగెత్తాను. ఫోనులో మా ఆవిడ గొంతు వినబడగానే నాకు ప్రాణం లేచి వచ్చింది. చాలాసేపు నేను చుట్టూవున్న ప్రపంచాన్ని మరచిపోయాను.

ఫోను దగ్గరినుంచీ తిరిగొచ్చాక "ఇప్పుడు మీ ముఖంలోకి వెలుతురు వచ్చింది" అంది సిల్వియా.

టకీలా మత్తు నషాలంవరకు యెక్కడంతో, వో రచయిత మరో స్త్రీతో కలిసి నాట్యం చేస్తున్నాడు. వాళ్ళచుట్టూ వున్న రచయితలంతా పెద్దగా స్పానిష్ పాట పాడుతున్నారు.

"సమస్య తీరిందా?" అంది ఫ్రెడా కళ్ళెగరేసి.

"సమస్యలు తీరుతాయా? లేదంటే ప్రస్తుతానికి వుపశమనం దొరికింది" అన్నాను. సిల్వియా ముఖం చిట్లించుకుని చూస్తోంది." మా అబ్బాయి యిటీవలే యింటర్మీడియట్ పాసయ్యాడు. యెమ్‌సెట్‌లో మంచి రాంకే వచ్చింది. కౌన్సిలింగ్‌లో హైదరాబాదు కాలేజీలో సీటు దొరికింది. సరిగ్గా సమయానికి నేనిక్కడికి రావల్సివచ్చింది. కౌన్సిలింగ్ కెళ్ళడం, హైదరాబాదులో కాలేజీని చూసిరావడం, యివన్నీ మా ఆవిడ చేయవలిసి వచ్చింది. ఆమెకీ సంగతులంత బాగారావు. అందుకని మా స్నేహితుడ్ని సహాయం చేయమని చెప్పి వచ్చాను.నేను తిరిగి వెళ్ళాక చివరి నిర్ణయం తీసుకుంటాను" అంటూ వివరించాను.

"నిర్ణయమేదో మీ కొడుకు తీసుకున్నాడుగా! యిక మీరందులో జోక్యం తీసుకోవడమేమిటి?" ఫ్రెడా గొంతు కీచుమంటూ పలికింది.

"మరెవరు నిర్ణయిస్తారు? మా ఆవిడ చదువుకున్నదే గానీ బయటి ప్రపంచం తెలిసిన వ్యక్తిగాదు. నా కొడుకు పిల్లవాడు. మా దేశంలో పిల్లల చదువులంటే అల్లాటప్పా వ్యవహారం గాదు. చెప్పలేనంత పోటీ... కార్పొరేట్ కాలేజీల రభస...యెంతో ఖర్చు... మంచి వుద్యోగాలు దొరకాలంటే పోటీల్లో నెగ్గాలి... ప్రభుత్వం వుద్యోగాలు యివ్వడం తగ్గించేసింది. రాజకీయాలు దూరని తావులేదు. లంచగొండితనం, బంధుప్రీతి ,మధ్యతరగతి జీవితాల్ని అతలాకుతలం చేస్తున్నాయి. మా వాడు యింజనీరై అమెరికా వెళ్ళిపోతే బతికిపోతాం. లేకపోతే ప్రతి చిన్న విషయానికీ రాజకీయ నాయకుల చుట్టు తిరుగుతూ గొంగళి పురుగుల్లా బతకాల్సిందే..."

నాధోరణికి అడ్డు కట్టవేస్తూ" స్వేచ్ఛగా విడిచిపెట్టక పోతే మీ కొడుకు యెలా బాగుపడతాడు?" అంటూ ఫ్రెడా విరుచుకు పడింది.

"పిల్లల విషయాల్లో తండ్రిది మాత్రమే బాధ్యతనుకుంటే యెలా? మీ భార్య అభిప్రాయమేంటో తెలుసుకున్నారా?" సిల్వియా కూడా ప్రశ్నతోనే యెదుర్కొంది.

నాకేమని సమాధానం చెప్పాలో తోచలేదు.

బోర్లించిన గిన్నెలపైన పెద్దగా బాదుతున్న శబ్దం హాలునంతా వులిక్కిపడేలా చేసింది. “యిప్పుడు సమయం నాలుగుగంటలు. యిక్కడ మరేదో బాంక్వెట్‌వుందట...” అంటూ భారత అంబెస్సీ మూడో సెకరట్రీ ప్రకటించాడు.

“యిక్కడ నాలుగు గంటలకింకో బాంక్వెట్ ఉందట. మనల్ని మర్యాదగా వెళ్ళిపోమని చెబుతున్నారు” అంటూ సిల్వియా పైకి లేచింది. ఆమెను గట్టిగా కౌగిలించుకున్నాక ఫ్రెడా “మరెప్పుడు కలవాలి? ఆదివారమేనా?” అని అడిగింది.

నేను వాళ్ళనే వింతగా చూస్తూ “మీ దేశంలో లెస్బియనిజమూ, హోమోసెక్సువలిజమూ యెక్కువని విన్నాను. నిజమేనా?” అని వాకబు చేశాను.

“యెవరిష్టం వాళ్ళది. యెవరి స్వాతంత్రం వాళ్ళది...” అని నవ్వేశాక సిల్వియా తన విజిటింగ్ కార్డు తీసిచ్చి “మెయిలిస్తాను. జవాబు రాయండి. మీ దేశం గురించి ఇంకా చాలా తెలుసుకోవాలని వుంది నాకు” అంది.

నేను ఫ్రెడాకు కూడా నా విజిటింగ్ కార్డునిచ్చి “మరి మీ మెయిల్ ఐడీ యివ్వండి” అని అడిగాను.

“ఆమెకే రాయండి. నా పేరుతో వచ్చిన మెయిల్స్‌ను ఆమె నాకు రీ-డైరెక్ట్ చేస్తుంది” అంది. “ఆమె మరచిపోతే?...” అని వేళాకోళంగా అడిగాను.

“నేను మరవను కదా! ప్రతి నెలా మూడో ఆదివారపు సాయంత్రం తల్లికి కేటాయించాను నేను...” ఫ్రెడా కీచుగొంతు చురకత్తిలా పలికింది.

“పోయిన నెలలో యేదో పనుండి మూడో ఆదివారం నేను వేరే వూరికెళ్ళిపోయాను. అందుకే యీ చిలిపి పిల్లకు కోపం” సిల్వియా ఆ అమ్మాయి బుగ్గపైన ముద్దు పెట్టింది. తర్వాత “దీనివన్నీ వాళ్ళ నాన్న బుద్ధులే! పెడ్రోలాగే యిది కూడా భలే పొసెసివ్. ప్రైవసీని జాగ్రత్తగా కాపాడుకుంటుంది. పెడ్రోలాగే కొత్తవాళ్ళకు అంత త్వరగా అడ్రస్సు యివ్వదు” అంది.

“అయితే... మీరిద్దరూ...” నేను కళ్ళార్పడం కూడా మర్చిపోయి వాళ్ళనే చూడసాగాను.

ఫ్రెడా గోముగా సిల్వియా పెదవుల మధ్యలోంచి సిగరెట్టును లాక్కుని తన నోట్లో పెట్టుకుని రెండు దమ్ములు లాగింది.

4-10-2007 ఈభూమి